# వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సిపి విజయ్‌కుమార్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మొంథా తుఫాన్‌తో రెండు,మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షం వలన ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చిన వెంటనే డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూం నంబరు 8712667100కు కాల్ చేయాలన్నారు. 24 గంటలు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. జిల్లాలో చెరువులు,కుంటలు నిండి ఉన్నందన ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. చెరువులు, కుంటలు పొంగిపోర్లితే వెంటనే ప్రజలు అటువైపు వెళ్లకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మట్టితో కట్టిన పురాతన ఇండ్లు కూలే ప్రమాదం ఉంటే సంబంధిత అధికారుల సహకారంతో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సహాయ సహకారాలు అందించాలన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

# జీవితంలో క్రీడలది ముఖ్య భూమిక : ప్రొ. చిన్నప్పరెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 29 ప్రభాతవార్త :** ఒకరి వ్యక్తిత్వాన్ని రూపొందించడంలో, సృజనాత్మకత, శ్రేయస్సులను పెంపొందించడంలో క్రీడలు కీలకపాత్ర పోషిస్తాయని వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలయన్స్ బోర్డు డైరెక్టర్, గ్లోబల్ కమ్యూనిటీ హెల్త్ టెక్ని కల్ హెడ్ ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యా లయంలోని స్పోర్ట్స్ డైరెక్టరేట్, గస్టో202526 పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్‌విశ్వవిద్యాలయ, అంతర్‌కళాశాల క్రీడాపోటీలను బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలనం తో లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రాంతంలోని పలు విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి వచ్చిన యువ క్రీడాకారులను ఉద్దేశించిన ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డి మాట్లాడుతూ.. ఆట ఉద్యోగం కోసం కాదు, ఇది వినోదం, ఉత్తేజం, పునర్జీవనం కోసం అన్నారు. విద్యార్థులు తమ ఆసక్తి, అభిరుచులకు అనుగుణంగా క్రీడలను ఎంపిక చేసుకుని, జీవితాన్ని కొనసాగించాలని ఆయన ప్రోత్సహించారు. ముఖ్యఅతిథిగా క్రీడా పోటీలను ప్రారంభించిన ప్రొఫెసర్ చిన్నప్పరెడ్డిని గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డిఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్ఆర్‌వర్మ, ఆతిథ్యక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికాఫిలిప్, స్పోర్ట్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి సత్కరించారు.



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాశాఖ అధికారి మాధవి

# 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి

## ఇంటర్ విద్యాశాఖ జిల్లా అధికారి మాధవి

**రామాయంపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త :** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఇంటర్ విద్యాశాఖ జిల్లా అధికారి మాధవి ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులో విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష ్యం చేయవద్దని సూచించారు. ఏ సబ్జెక్టులో ఉత్తీర్ణత శాతం తక్కువ ఉంటే అట్టి లెక్చరర్ పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి వారికి విద్యా బోధన చేయాలని సూచించారు ప్రతి సబ్జెక్టుపై విద్యార్థి పట్టు సాధించే విధంగా వారికి విద్యా బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి అధ్యాపకులు ఉన్నారు.

# వనదుర్గమ్మ గర్భగుడి మళ్లీ మూసివేత

## రాజగోపురంలోనే పూజలు...



భక్తులకు దర్శనమిస్తున్న దుర్గమ్మ

**పాపన్నపేట, అక్టోబరు 29, ప్రభాతవార్త :** సింగూరు ప్రాజెక్టు నుంచి ఎగువకు నీటినివదలడంతో ఏడుపాయల దుర్గమ్మ ఆలయం మళ్లీ మూత పడింది. దీంతో బుదవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురం లో ఉంచి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఒడి బియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు శంకర శర్మ, పార్థివ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ సిబ్బంది, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సేవలందించారు.

# సిఐ ఆకస్మిక బదిలీలో ఆంతర్యం ఏమిటి ?

**హత్నూర, అక్టోబరు 29 ప్రభాతవార్త :**

జిన్నారం సిఐ నయీముద్దీన్ ఆకస్మిక బదిలీ స్థానిక పోలీసు వర్గాలతో పాటు స్థానిక ప్రజలలో తీవ్ర చర్చనీయంశముగా మారింది. గత సంవత్సరం నవంబర్ 19న జిన్నారం సీఐగా బాధ్యతలు చేపట్టిన నాయీమోద్దీన్, సంవత్సరం కాకముందే బదిలీ కావడం, స్థానికంగా నాయకులు ప్రజలు పలు రకాలుగా చర్చించు కుంటున్నారు. జిన్నారం సీఐగా పనిచేసిన నాయీమోద్దీన్ బదిలీ కావడం తో, అతని స్థానంలో పి.రమణారెడ్డి నూతన సీఐగా మంగళవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. జిన్నారం సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో నర్సాపూర్ నియోజకవర్గంలో పరిధిలోని హత్నూర మండలం (సంగారెడ్డి జిల్లా), పటాన్‌చెరు నియోజకవర్గంలోని గుమ్మడిదల, జిన్నా రం పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. రోజువారీగా విధులు నిర్వహిస్తూ మంగళ వారం డ్యూటీలో ఉన్న నాయీమోద్దీన్‌కు,నూతన సీఐగా బదిలీపై వచ్చిన పి.రమణారెడ్డి బదిలీ ఉత్తర్వులు అందించేవరకు సంబంధిత స్థానిక అధికారులకు తెలుయదు. సర్కిల్ పరిధిలో ఇటీవల జరిగిన కొన్ని పరిణా మాల నేపథ్యంలో రాజకీయ వత్తిడి కారణంగానే సీఐ నయిముద్దీన్ బదిలీ జరిగిందని ప్రజలలో ప్రచారం జరుగుతోంది. రెండు నియోజక వర్గాల పరిధిలోని అధికార పార్టీ నాయకులలో ఏ ఒక్కరికి నిరాశపర్చిన బదిలీ ఎప్పుడు జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు నేలకొన్నాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.

# సంగారెడ్డిలో జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**

పట్టణంలోని డిఎం అండ్ హెచ్ఓ చాంబర్‌లో బుధవారం పిసి పిఎన్‌డిటి ఆక్ట్ జిల్లా అడ్వైజరీ సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో జిల్లాలోని స్కానింగ్ సెంటర్ లకు సంబంధించిన కొత్త రిజిస్ట్రేషన్‌లు, రెన్యూవల్ గురించి చర్చించారు. రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ కమిటీ పంపిన నివేదక ఆధారంగా స్కానింగ్ సెంటర్‌లపై చర్యలు తీసుకోవాల్సిందిగా పై కమిటీకి రిఫర్ చేశారు. జిల్లాలో స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులు విధిగా పిసి అండ్ పిఎన్‌డిటి ఆక్ట్ నిబంధనలను, నియమాలను పాటిస్తూ ఆన్‌లైన్‌లో, హార్డ్‌కాపీ రూపంలో డిఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయానికి పంపాలని, అలక్ష్యం వహిస్తే రిజిస్ట్రేషన్ లైసెన్సులు రద్దుచేసి తగు చర్యలు తీసుకుకోవాలని కమిటి నిర్ణయించింది. సమావేశంలో డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కె నాగ నిర్మల, కమిటి చైర్మన్, సభ్యులు డాక్టర్ సంధ్య, డాక్టర్ రజని కోమల్, డాక్టర్ సుదారాణి, డాక్టర్ కె రాజుగౌడ్, డిపిఆర్ఓ జి ఏడుకొండలు, డిఈఎంఓ ప్రసాద్, రవిలు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో డిఎం అండ్ హెచ్ఓ చాంబర్‌లో సమావేశమైన దృశ్యం

# మొంథా తుఫాన్‌తో జిల్లాలో భారీ వర్షం

*** స్తంభించిన జనజీవనం * వరి, పత్తి పంటలకు తీరని నష్టం * మార్కెట్‌యార్డు, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం**



నీటితో నిండిపోయిన హుస్నాబాద్ బస్టాండు



దుబ్బాక కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

మొంథా తుఫాన్ కారణంగా బుధవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురుస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. తుఫాన్‌తో వరి, పత్తి పంటలకు తీరని నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాన్ కారణంగా జిల్లాలోని మార్కెట్ యార్డులకు,కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన వరి, మొక్కజొన్న తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీటి నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి టార్పలిన్ కవర్లు కప్పిన ఫలితం దక్కడం లేదు. వర్షానికి ధాన్యం తడిసిపోతుండడం తో కాపాడుకోవడానికి నానాతంటాలు పడుతున్నారు. జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ తదితర మార్కెట్ యార్డులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చిన ధాన్యం తడిసిపోయింది. హుస్నాబాద్ బస్టాండు వర్షం నీటితో నిండిపోవడం తో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సిద్దిపేటలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి, ఇప్పటికే చెరువులు, కుంటలు నిండి ఉండడంతో మొంథా తుఫాన్‌తో మరో సారి భారీగా వర్షం కురుస్తుండడంతో చెరువులు, కుంటలు పొంగిపోర్లుతున్నాయి. మొత్తంమీద మరోసారి మొంథా తుఫాన్ రైతులకు తీరని నష్టం కలిగించింది. తుఫాన్ కారణంగా చేతి కందిన వరి. పత్తి పంట నేలకొరగడంతో తీరని నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు.

# ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక లాభాలు

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబర్ 29, ప్రభాతవార్త:** ఆయిల్‌పామ్ సాగు ఒక కల్పవృక్షం లాంటిదని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంయుక్తంగా జిల్లాలోని సహకార సంఘాల సీఈవోలు, రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగుపై అవగాహనసదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూనె గింజల సాగులో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి తెలిపారు. ఒకసారి ఆయిల్‌పామ్ పంట దిగుబడి రావడం ప్రారంభమైతే 25-30 సంవత్సరాలపాటు వరుసగా ఆదాయం వస్తుందన్నారు.ఆయిల్‌పామ్ సాగువల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌పాం సాగును చేపట్టవచ్చన్నారు. జిల్లాలో ఈ ఏడాది 3750 ఎకరాలు ప్రభుత్వం టార్గెట్‌గా నిర్ణయించగా ఇప్పటికివరకు 1400 ఎకరాలలో ఆయిల్‌పామ్ పంట సాగుచేసినట్లు తెలిపారు.సహకార సంఘాల సీఈవోలు ఆయిల్ప్‌ఆమ్ సాగువల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి అత్యధిక విస్తీర్ణంలో తమ పరిధిలో రైతులు ఆయిల్ ఫామ్ సాగు చేసే విధంగా చర్యలు చేపట్టాలని సందర్భంగా కలెక్టర్ సహకార సంఘాల సీఈఓలకు సూచించారు. జిల్లాలోని రైతులు ఉన్నత లాభాలు ఇచ్చే నాణ్యమైన పంటలను సాగు చేసేలా సహకార సంఘాల సీఈవోలు ఉద్యానవన శాఖ వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఇతర నూనె గింజల పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ 4-5రెట్లు ఎక్కువ నూనె గింజలను ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగువల్ల మార్కెట్ భయం లేదని కంపెనీలే తోట వద్దకు వచ్చి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. తక్కువ నీటితో డ్రిప్ పద్ధతిలో ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగువల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలుపెరగడంతోపాటు దీర్ఘకాలంలో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులు మాట్లాడుతూ ఫలాల సేకరణ నుండి చెల్లింపుల దాకా రైతులకు పూర్తి భరోసా ఇస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సిహెచ్ పండరి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, డిసిఓ కిరణ్‌కుమార్, ఉద్యానవన అధికారులు, గోద్రెజ్ ఆగ్రోవెట్ జనరల్ మేనేజర్ స్వీటీ వేగుంట, సహకార సంఘాల చైర్మన్లు, అధ్యక్షులు,సహకార సంఘాల సెక్రటరీలు, కార్యదర్శులు, రైతులు ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త :**

రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొను గోలు చేసి మద్దతు ధరను చెల్లిస్తుందని...కొంత మంది బిఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని ప్రభు త్వంపై బురదజల్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షులు ఎం.డి. ఇమామ్(అత్తు) మండిపడ్డారు. సిద్దిపేటలోని మార్కెట్ యార్డును బుధవారం సందర్శించి కొనుగోలు తీరును పరిశీలించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి గిం జను కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుంటే సిద్ది పేటలో బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి రైతులను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను రెచ్చగొడుతున్న మచ్చ వేణు గోపాల్‌రెడ్డిపై సుమోటో కేసు నమోదు చేయాలని కోరారు. మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు తగు ఏర్పాట్లు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మొంథా తూపాన్ కారణంగా ధాన్యం తడవకుండా రైతులకు మరిన్ని టార్పలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దళారు లను అడ్డుకునేందుకు ఐరీస్ బయోమెట్రిక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతులు వద్దు అనుకుంటే ఐరీస్ బయోమెట్రిక్ తొలిగించడానికి సిఎంతోపాటు మంత్రులు నాగేశ్వర్‌రావు, వివేక్‌వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. బిఆర్ఎస్ నాయకులు కావాలనే రైతులను రెచ్చ గొడుతున్నారని మండిపడ్డారు.బిఆర్ఎస్ నాయకుల మాటలు విని రైతులు మోసపోవద్దన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఆయనవెంట పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్, హర్షద్, బాబా ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అత్తు

# టిజిఐఐసి, నిమ్జ్‌కు భూ సేకరణ వేగవంతం చేయాలి

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 29, ప్రభాతవార్త:**

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పారిశ్రామిక ప్రాజెక్టులకు అనుగుణంగా భూసేకరణ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంగారెడ్డి, జహీరాబాద్ డివిజన్లలో పురోగమిస్తున్న టీజీఐఐసి, జాతీయ రహదారి-65 విస్తరణ, రీజినల్ రింగ్‌రోడ్(ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, నిమ్జ్‌కు సంబంధించిన భూమిని ప్రత్యేక ప్రయోజన సంస్థ(ఎస్‌పివి స్పెషల్ పర్పస్ వెహికల్)కు అందించే అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతులకు అందించే పరిహారం జాప్యం లేకుండా అందించాలని సూచించారు. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు పరిధిలో భూములు ఇచ్చిన రైతులకు మంజూరైన నగదు వెంటనే చెల్లించాలని, నగదు విడుదలలో జాప్యం జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలుతీసుకోవాలని, ప్రభుత్వ పథకాల కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వడానికి నిధుల కొరత ఏదీ లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నిమ్జ్ సంబంధించిన భూసేకరణ అనంతరం సొంత హక్కులు,బాధ్యతలు అధికారికంగా సంస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. టీజీఐఐసి, నిమ్జ్ ప్రాజెక్టులకు ఇప్పటివరకు భూములు ఇచ్చిన రైతులకు ప్యాకేజీల ప్రకారం పూర్తిస్థాయిలో పరిహారం అందించాలని తెలిపారు. జాతీయరహదారి 65 విస్తరణలో భాగంగా చేపట్టిన సర్వీస్ రోడ్డు పనులు అడ్డంకులు లేకుండా కొనసాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రెవెన్యూ, టీజీఐఐసి, నిమ్జ్, ఆర్అండ్‌బి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఆర్థిక ప్రణాళిక శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో నిమ్జ్ ప్రత్యేకాధికారి విశాలాక్షి, సంగారెడ్డి- జహీరాబాద్ ఆర్డీవోలు, టీజీఐఐసి, నిమ్జ్, జాతీయ రహదారి అథారిటీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



సింగూరు ప్రాజెక్టు గేటు ఎత్తివేసి కిందక నీరు వదులుతున్న దృశ్యం

# సింగూరుకు వరద ప్రవాహం

## ఒక గేటు ఎత్తి దిగువకు నీరు విడుదల

## -ఇన్‌ఫ్లో 11877, అవుట్‌ఫ్లో 12082 క్యూసెక్కులు

**పుల్‌కల్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**

మండలంలోని సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం దూసుకొస్తోంది. మొంథా తుఫాన్ కారణం గా మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి ప్రాజెక్టుకు చేరుకుంటోంది. బుధవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 11877 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టులోకి వరద నీరు చేరుకుంటుండటం తో నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు ప్రాజెక్టు 14వ క్రస్ట్ గేటును 2 మీటర్లు ఎత్తి 9649 క్యూసెక్కుల వరదను దిగువన ఉన్న మంజీర జలాశయానికి విడుదల చేశారు. జల విద్యుత్ ఉత్పత్తి గేట్ ద్వారా 2433 క్యూసెక్కులు ఔట్ ఫ్లో 12082 క్యూసెక్కులుగా నమోదైంది.

# నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 29,ప్రభాతవార్త:** సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ ఎన్‌డిపిఎస్ కేసులలోపట్టుబడిన పది వాహనాలను ఈ నెల 30న సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం వేయడం జరుగుతుందని సంగారెడ్డి ఎక్సైజ్ సి.ఐ.ఎండి.నజీర్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొన వచ్చని ఆయన తెలిపారు

# గ్రామ దేవతల ప్రతిష్ఠ మహోత్సవానికి ఎంపిలకు ఆహ్వానం



ఈటలకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

**వర్గల్, అక్టోబరు 29 (ప్రభాతవార్త):**

మండల పరిధిలోని దండుపల్లి గ్రామంలో నవంబరు 1వ తేదీ నుండి 3వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ పోచమ్మ, శ్రీ ముత్యాలమ్మ గ్రామదేవతల పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు, మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌లకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, మండల ఉపాధ్యక్షుడు యాదగిరి, నాయకులు జగన్, సంజీవులు, దండుపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాచగిరిలో కార్తీకమాస ప్రత్యేక పూజలు

**వర్గల్, అక్టోబరు 29 (ప్రభాతవార్త):** వర్గల్ మండలం నాచగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీకమాసంను పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామి వారి నిత్యాభిషేకాలు, నిత్య కళ్యాణాలు, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆచరించారు. కాగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం దీపాలు వెలిగించడం జరిగింది. తదుపడి ఆకాశ దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



నాచగిరి క్షేత్రంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

# తుపాకితో బెదిరించిన అగంతకులు

**మిరుదొడ్డి, అక్టోబరు 29.ప్రభాతవార్త :** మంగళవారం రాత్రి ఇంట్లోకి చొరబడి ఇద్దరు అగంతకులు తుపాకితో బెదిరించిన సంఘటన మిరుదొడ్డి పోలీసుస్టేషన్ పరిధిలోని రుద్రారంలో జరిగింది. గ్రామస్తులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మీనర్సయ్య ఆర్ఎంపి డాక్టర్ ఇంట్లోకి ఇద్దరు అగంతకులు చొరబడి తుపాకితో బెదిరించారు. దీంతో విస్తుపోయిన అతని భార్య కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో మంకీ క్యాపులు ధరించిన ఇద్దరు అగంతకులు బైక్‌లపై పారిపోయినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపిన

# 11 మందికి రూ.లక్షా 10వేల జరిమానా

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 29 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి రూ.లక్షా 10వేల జరిమానా విధించిన సంఘటన గజ్వేల్‌లో చోటుచేసుకుంది. గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 11 మందికి బ్రీత్ ఎనలైజర్‌తో టెస్ట్ చేయగా మద్యం సేవించి ఉన్నట్లు రిపోర్టు రావడంతో వారిని బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ముందు హాజరుపరిచినట్లు తెలిపారు. విచారణ చేసిన మెజిస్ట్రేట్ 11 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున లక్షా 10వేల జరిమానా విధించినట్లు తెలిపారు.


మాట్లాడుతున్న కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం

## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కౌన్సిలర్

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 29, ప్రభాతవార్త :** మొంథాతుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం విజ్ఞప్తి చేశారు. తప్పనిసరి అయితే తప్ప ప్రజలు, పిల్లలు ఎవరూ బయటకు రావొద్దన్నారు. చిన్నారులను, వృద్ధులు కుటుంబీకులు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. పాత ఇండ్లు, విద్యుత్ స్తంభాలకు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరా ప్రాంతాల్లో ఎక్కడ కూడా నీటిని నిల్వ ఉంచుకోవద్దన్నారు. ఇంటి పరిసరా ప్రాంతాలలోని పూల కుండీలు, టైర్లు, కూలర్లు, నీటి డ్రమ్ హౌజ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసకోవాలన్నారు. నీరు నిల్వ ఉంట దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గూడల శ్రీకాంత్‌గౌడ్, ఉదర మణిదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

**మంత్రి వివేక్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి**


జూబ్లీహిల్స్‌లో ప్రచారంలో ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు

**నారాయణఖేడ్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా ఇంటింటి ప్రచారంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. హైదరాబాద్‌లోనీ జీహెచ్ఎంసీ పరిధిలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారంలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను వారు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నాన్నారు. ప్రచారంలో దారం శంకర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ శివ రాథోడ్, తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తాహెర్ అలీ, పార్టీ మండల అధ్యక్షుడు సిద్ధరెడ్డి, యూత్ కాంగ్రెస్ ఖేడ్ నియోజకవర్గం అధ్యక్షుడు పండరిరెడ్డి, ముంతాజ్, మాజీ ఎంపిటీసీ మజీద్, మాజీ కౌన్సిలర్, దిల్దార్‌ఖాన్, షారూకాన్ యూత్ కాంగ్రెస్ నాయకులు సంజీవ్ పాటిల్ గౌస్ చిస్తి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలి


గజ్వేల్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 29 (ప్రభాతవార్త):** చీఫ్ జస్టిస్ బిఆర్.గవాయ్‌పై దాడిజరిగి 20 రోజులు అవుతున్నా దాడికి పాల్పడినవారిపై కేసు నమోదు చేసి శిక్షించకపోవడం దారుణమని ఎమ్మార్పీఎస్ గజ్వేల్ నియోజకవర్గ నాయకులు అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్ల కార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందన్నారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జి ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసేవారా, తమ దళితుడు కాబట్టే స్పందించాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ పద్మశ్రీ మంద కృష్ణమాదిగ నేతృత్వంలో నవంబరు 1న హైదరాబాద్‌లో ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ ర్యాలీ జగ్జీవన్‌రాం విగ్రహం నుండి సెక్రటేరియట్ పక్కన ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగుతుందన్నారు. ర్యాలీలో కుల మతాలకు, పార్టీలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడు చిన్నరాజిగారి కిషన్, జిల్లా నాయకుడు బొంది స్వామి, నాయకుడు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**పుల్‌కల్, అక్టోబరు 29,ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన గాండ్ల మాణెమ్మకు(29వేలు), నంది ప్రతాప్‌రెడ్డి, నంది మాణిక్యంరెడ్డిలకు 60వేల రూపాయల చొప్పున) అనారోగ్యానికి గురికావడంతో కార్పోరేటు ఆసుపత్రిలో మెరుగైన చికిత్స అందుకునేందుకు కాంగ్రెస్ నాయకులు బోయిని శ్రీనివాస్‌యాదవ్ సిఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం అందచేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బచ్చుమొల్ల ఉదయ్ కుమార్, నాయకులు మేతరి శ్రీనివాస్, గాండ్ల రాజు, పెంటయ్య పాల్గొన్నారు.

## జీవితంలో క్రీడలు చాలా ముఖ్యమైనవి

**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ దల్‌జిత్‌సింగ్**

**పటాన్‌చెరు, అక్టోబరు 29 ప్రభాతవార్త :** జీవితంలో క్రీడలు చాలా ముఖ్యమైనవని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్దార్ దల్ జిత్ సింగ్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజేష్ ఆధ్వర్యంలో మాస్టర్ మైండ్స్ క్రికెట్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు సర్దార్ దల్‌జిత్ సింగ్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ బసవరాజ్, పటాన్‌చెరు ఎంఈఓ నాగేశ్వర్‌నాయక్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, మాస్టర్ మైండ్స్, ఓక్ లీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ రాజు సంగాని, సికెఎస్ సీనియర్ కోచ్, ఐపీఎల్ ప్లేయర్ ఖాజా హాజరయ్యారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఒలింపిక్ జ్యోతిని వెలిగించి పోటీలకు శ్రీకారం చుట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ... క్రీడలు మన జీవితంలో అత్యంత ముఖ్యమైనవి అవి క్రమశిక్షణ, జట్టు భావన, ఓర్పు వంటి విలువలను నేర్పిస్తాయని అన్నారు. విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయి అని తెలిపారు. చైర్మన్ రాజు సంగాని మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలనే మా విద్యా సంస్థల ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం


చౌటకూరులో ధన్వంతిరి నారాయణ జయంతిని జరుపుకుంటున్న దృశ్యం

## చౌటకూరులో ధన్వంతరి నారాయణ జయంతి

**చౌటకూరు, అక్టోబరు 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ధన్వంతరి నారాయణ జయంతి వేడుకలను నాయీబ్రాహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ధన్వంతరి నారాయణ చిత్ర పటానికి జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్ల నాగభూషణం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షులు బోనోల్ల గంగారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మామిళ్ల నాగభూషణం మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేలా ప్రజాప్రతినిధులకు కలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారాం, పుల్‌కల్ మండల అధ్యక్షుడు హరీష్, నాయకులు ప్రశాంత్, మల్లేశం, రాజు, చెన్నయ్య, కాశీపతి, ఈశ్వర్, దుర్గయ్య పాల్గొన్నారు.

## అయ్యప్పస్వాములకు ఆర్థికసహాయం

**రామచంద్రాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**

శబరిమలకు మహాపాదయాత్రద్వారా చేరుకుని స్వామివారిని దర్శించుకునేందుకు వెళుతున్న అయ్యప్పస్వాములకు ఆర్‌కె ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బిఆర్ఎస్‌నేత కాల్వగడ్డ రాజ్‌కుమార్ 50వేల రూపాయల ఆర్థికసహాయాన్ని అందచేశారు. బిహెచ్ఈఎల్ అయ్యప్పస్వామి ఆలయంనుంచి శబరిమలకు పాదయాత్రగా తరలిన వెలిమెల స్వాముల బృందానికి సంఘీభావం తెలుపుతూ స్వాములతో కలసి కొంతదూరం రాజ్‌కుమార్ పాదయాత్ర చేశారు.

## అర్బన్ పార్క్‌ను సందర్శించిన విజిలెన్స్ అధికారులు


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన రీజినల్ విజిలెన్స్ అధికారులు

**నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త :** నర్సాపూర్ అడవీ ప్రాంతంతో గల అర్బన్ పార్క్‌ను రీజినల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ బృందం సందర్శించారు. ఈ మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి మెదక్ నిజామాబాద్ జిల్లాల రీజినల్ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి శృతకీర్తి ఎస్పీ బృందంతో కలిసి బుధవారం నర్సాపూర్ సమీపంలోని అర్బన్ పార్క్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థుల చేత విజిలెన్స్ అవేర్నెస్ కార్యక్రమం లో భాగంగా మొక్కలు నాటి సంరక్షిద్దామంటూ ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎఫ్ ఆర్ ఓ అరవింద్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సాయిరాం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ గోపాల్ అటవీ శాఖ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల ప్రదర్శనలు

**నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త :** పర్యావరణాన్ని కాపాడుకోవడంలో ఎలక్ట్రానిక్స్ వేస్ట్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని విష్ణు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని శ్రీవిష్ణు ఫార్మసిటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ కళాశాలలో హరితాన్ హెకతోన్ 2025 తెలంగాణ నేషనల్ గ్రీన్ మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్ ఎన్విరాన్‌మెంట్ క్లైమేట్ చేంజ్ అసోసియేషన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ వేస్ట్ వల్ల ఏర్పడుతున్న కాలుష్యాన్ని నివేరించే దిశగా విద్యార్థులు తమ తమ ప్రదర్శనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎలక్ట్రానిక్ వేస్ట్‌పై రకరకాల ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ ఎలక్ట్రానిక్ వేస్ట్‌ని ఏ విధంగా ఉపయోగించుకోవచ్చుని, విద్యార్థులు ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారన్నారు. ఈ వేస్ట్ ని ఉపయోగించు కో వడం వల్ల ప్రకృతికి ఎంతో లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ ప్రదర్శన కార్యక్రమంలో విజయ్ తెలుగు పలువురు విద్యార్థులు నిలువగా ఆశిష్ భరద్వాజ్ అండ్ టీం మొదటి స్థానంలో నిలువగా రెండవ మూడవ స్థానంలో వైష్ణవి అంటి స్థానం నిలిచింది. ఈ ప్రదర్శన కార్యక్రమంలో విజేత లేన విద్యార్థులకు నగదు పారితోషికంతో పాటు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు వివిఎస్ రాజేంద్రప్రసాద్, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి కృపా రాజ్, కోఆర్డినేటర్స్ డాక్టర్ జాహ్నవి, డాక్టర్ సంధ్యారాణి, నమీరా, జబీన్, లక్ష్మి ్మ, శ్రావణి పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కన్నీరు పెట్టిస్తున్న రైతుల గోస

**బిజెపి నేత నరసింహయాదవ్**

**కేశంపేట, అక్టోబరు 29, ప్రభాత వార్త:** గత మూడు రోజుల నుండి కురుస్తున్న అధిక వర్షాలవల్ల నష్టపోయిన పత్తి రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బిజెపి సీనియర్ నాయకులు పసుల నరసింహ యాదవ్ అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పత్తి రైతులను, అధిక వర్షాల వల్ల దెబ్బ తిన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి నష్టపోయిన పంటని పరిశీలించి ఆ రైతులను గుర్తించి ప్రభుత్వ సహాయం వచ్చే విధంగా చూడాలని కోరుతున్నాము.రాష్ట్ర వ్యాప్తంగా అధిక వర్షాల వల్ల పత్తి పంటలు యాభై శాతం దెబ్బ తిన్న కూడ ఇప్పటి వరకు ఏ ఒక్క అధికారి కూడ పంటలను పరామర్శించలేదు అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పత్తి ,మొక్కజొన్న రైతులను ఆదుకొని ఎకరానికి 50 వేల రూపాయలను నష్ట పరిహారం అందించాలని అన్నారు.ప్రధానమంత్రి మోదీ ప్రవేశ పెట్టిన పసల్ బీమా యోజన పథకం రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లిమెంటేషన్ చేసిఉంటే రైతులకు మేలు జరిగేది అని అన్నారు.ఇకనైనా అధికార పార్టీ నాయకులు, అధికారులు కళ్లుతెరిచి గ్రామాల్లో పర్యటించి రైతులకు భరోసా కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దళితుల ఆత్మగౌరవ సభను జయప్రదం చేద్దాం

**ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శీనుమాదిగ**

**కేశంపేట, అక్టోబరు 29, ప్రభాత వార్త:** నవంబర్ 1న హైదరాబాద్ లో నిర్వహిస్తున్న దళితుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేసేందుకు కేశంపేట మండల పరిధిలోని దళితులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కేశంపేట మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను మాదిగ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిర్ర రమేష్, దశరథ్, కిష్టయ్య, రామచంద్రయ్య, జంగయ్య గోపాల్, యాదగిరి,చింటూ ఆది పాల్గొన్నారు.

## పోలీస్‌ల ఆధ్వర్యంలో నర్సాపూర్ బస్టాండ్‌లో తనిఖీలు

**నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త :**

ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో పోలీసు జాగిలాలతో బుధవారం సాయంత్రం నర్సాపూర్ బస్టాండ్ లో తనిఖీలు నిర్వహించారు. నర్సాపూర్ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసు జాగిలాలతో తనిఖీలు చేపట్టి మాదకద్రవ్యాలు ఏమైనా ఉన్నాయా అంటూ పరిశీలించి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులను ఉద్దేశించి ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికులు ప్రయాణించే సమయంలో జాగ్రత్త వహించాలన్నారు. బంగారు వస్తువులు డబ్బులు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పలు సూచనలు సలహాలను జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి

## యాంత్రీకరణతో రైతులకు లాభాలు

**-తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి**

**జహీరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**

రైతులు ఆధునిక వ్యవసాయాన్ని యాంత్రీకరణతో చేసుకుంటే అన్నదా తలు ఆర్థికంగా ప్రయోజనం అందుకుంటారని తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం జహీరాబాద్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ శాఖ ఆర్థిక సహాయంతో పట్టణంలోని పివిఆర్ గార్డెన్స్ లో నియోజకవర్గంలోని ఆరుగురు రైతులకు చెరుకు హార్వెస్టింగ్ యంత్రాలను పూజా కార్యక్రమాలు నిర్వహించి అందచేశారు. ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ చెరుకును హార్వెస్టింగ్ చేసుకునేందుకు కూలీల కొరత తీవ్రంగా ఉందని, అందుకు యంత్రాలను వినియోగించుకుని చెరుకును సునాయాసంగా కత్తిరించుకోవచ్చన్నారు. హార్వెస్టింగ్‌యంత్రాలతో కూలీలబెడద తప్పడంతోపాటు సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. సమావేశంలో నాబార్డ్ డిడి కృష్ణతేజ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సంగారెడ్డిజిల్లా రీజినల్ మేనేజర్ సమత, అడ్వాన్స్ మేనేజర్ హబీబుల్లా, జహీరాబాద్‌శాఖ మేనేజర్లు శివప్రసాద్, రామకృష్ణ, వ్యవసాయ సహాయసంచాలకులు బిక్షపతి, న్యూల్యాండ్ మేనేజర్ వాసుభారత్, ఎస్పీల్డ్ మేనేజర్ నాగేశ్వరరావు, గణపతి షుగర్స్ జిఎం కృష్ణమనోహర్, బసంత్‌రెడ్డి, మెప్మా హార్వెస్టర్‌యంత్రాలు పొందిన రామ్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, మదుసూదన్‌రెడ్డి, నరసింహరెడ్డి, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా డ్వాక్రాగ్రూప్ హెల్ప్ మహిళ లకు రూ. 5కోట్ల రుణాలచెక్కును చైర్మన్ ప్రతాపరెడ్డి అందచేశారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

**ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త :** రెండు రోజులుగా రాష్ట్రంలో మెంథా తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో నర్సాపూర్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ధాన్యం తడిసి నీట కొట్టుకుపోవడం జరిగిందని, ఈ తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బుధవారం ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నర్సాపూర్ నియోజక వర్గంలోని పాంబండ, ఖాజీపేట, సంగాయిపేట, రంగంపేట, చిన్నఘనపూర్, వరిగొంతం, చిలప్‌చేడ్, గ్రామాల్లో పొలాల్లో కోతలు కోసిన వరిధాన్యం నీట మునిగి తడిసి ముద్దయిందన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో అన్ని మండలాలకు సంబంధించిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట నష్టాల గణాంకాలను సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. అంతేగాక జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌తో మాట్లాడి రైతులకు టార్పాలిన్ కవర్లను వెంటనే అందజేయాలని అలాగే రైతులు కేంద్రాలకు తీసుకొచ్చిన తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి : సిఐ


ఆటో ర్యాలీని ప్రారంభిస్తున్న సిఐ జాన్‌రెడ్డి, ఎస్ ఐ.రంజిత్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త :** ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని సీఐ జాన్‌రెడ్డి పేర్కొన్నారు బుధవారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో ఆటో యూనియన్ల ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 75 ఆటోల డ్రైవర్లు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సీఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ ప్రయాణీకులను సురక్షి తంగా గమ్యం చేర్చే విధంగా ఆటో డ్రైవర్లు విధులు నిర్వర్తించాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రత ప్రమాణా లను పాటించాలని డ్రైవర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి ఎస్సై 2 జగన్నాథం పోలీస్ సిబ్బంది ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెళ్లికి నిత్యావసర సరుకులు అందజేత

**కేశంపేట, అక్టోబరు 29, ప్రభాత వార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన మల్తుంకర్ ఈశ్వరి బాయ్ ఇసుబాబుల కూతురు లక్ష్మీ ్మబాయి వివాహము నేడు గురువారం జరగనుంది. విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బీస కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో లక్ష్మీ ్మబాయి కుటుంబ సభ్యు లకు రూ.11 వేలు విలువైన నిత్యావసర సరుకులు పెళ్లి కూతురు ఇంటికి వెళ్లి ఇచ్చా మని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పెళ్లికూతురు బంధువులు గ్రామస్తులు కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ పేద ఆడపడుచుల పెళ్లిళ్లకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, గ్రామంలో పేదలైన ఏ ఆడ పడుచు పెళ్లి ఉన్నా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోగుల భీమయ్య, గుత్తి శేఖర్, గుత్తి చంద్రయ్య, డాక్టర్ వెంకటేష్, ఆలూరు శ్రీనివాసరెడ్డి, కల్వకోలు నిరంజన్, శంభుల శేఖర్, పోగుల నర్సింలు, కందెన శివయ్య ,పబ్బతి మల్లయ్య, బ్యాగరి మల్లయ్య, బత్తిన శేఖర్, శంభులం మంగల్ రాజు గొల్ల బాలకృష్ణ, కావలి చెన్నయ్య, భాషమెని మల్లేష్, కటికే యాదగిరి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**కేశంపేట, అక్టోబరు 29, ప్రభాత వార్త:** కేశంపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 21మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణలక్ష్మి చెక్కులను బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పంపిణీ చేశారు. ఫరూక్ నగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వ హించిన కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి, షాదిముభారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు పెళ్లిళ్లకు వరంగా మరిందన్నారు. దేశంలోనే ఈ పథకం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజేందర్ రెడ్డి, ఆర్ ఐ చెన్న కేశవులు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడ వీరేశం, మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి మార్కెట్ డైరెక్టర్లు టి.కర్ణాకర్, భాస్కర్‌గౌడ్ నాయకులు కృష్ణయ్య యాదవ్, ఇబ్రాహీం, రమేష్, ఎండి.అమేర్, తుమ్మల గోపాల్, మల్లేష్ యాదవ్, ముత్యాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**కేశంపేట, అక్టోబరు 29, ప్రభాత వార్త:** గ్రామాలలో శరవేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగం పుంజుకున్నాయన్నారు. ఎక్కడ చూసినా అభివృద్ధి కళ్ళకు కట్టినట్టు కనపడుతుందని రాజు అన్నారు. కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్ గ్రామం నుండి మురళి నగర్ వరకు, కొత్తపేట గ్రామం నుండి కోనాయిపల్లి వరకు బిటి రోడ్ల పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిధులను మంజూరు చేశారు అన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంతో మాజీ ఎంపిటిసి రాజు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రోడ్లు దీనవస్థత స్థితికి చెందడంతో బాటసారులకు ఎన్నో రకాల ఇబ్బందులు కలిగేవని తమ విలువైన వాహనాలను దెబ్బతిని ప్రమాదాలు జరిగాయని అన్నారు. బిటి రోడ్ల నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు ఇక తొలగిపోనున్నాయి.


కోహెడలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

## కోహెడలో బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

**కోహెడ, అక్టోబరు 29, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కుక్కల బెడద ఎక్కువైంది. రోడ్డుపై, జనావాసాల మధ్య గుంపు గుంపులుగా తిరుగుతున్నాయి. స్థానిక వ్యాపారుల దుకాణాల ముందు కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాల నుంచి తమ అవసరాల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చేవారు కుక్కల బెడదతో ఇబ్బందిపడుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై సంచరిస్తూ వాహనదారులను వెంబడిస్తున్నాయి.రోజు ఎక్కడ పడితే అక్కడ జనావాసాల మధ్య తిరుగుతూ..మొరుగుతూ...తిరుగుతున్నాయి. కుక్కలతో స్థానిక వ్యాపారులు, ప్రజలు భయందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**కోహెడ, అక్టోబరు 29, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన వేల్పుల సంపత్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవా సమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు బాధిత కుటుంబీకులను బుధవారం పరామర్శించారు. అనంతరం బాధితకుటుంబానికి 50 కిలలో బియ్యం అందజేశారు. ఆయన వెంట వేల్పుల మల్లయ్య, డాక్టర్ జయశంకర్, రాజేందర్, సమ్మయ్య, లక్ష్మణ్, మహేష్, రమేష్.జగన్ తదితరులు ఉన్నారు.

## వర్షానికి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి**

**చేర్యాల, అక్టోబరు 29, ప్రభాతవార్త :** వర్షానికి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి వీరన్నపేట మాజీ సర్పంచ్ కొండపాక బిక్షపతి కోరారు. ఆరుగాలలు ఎంతో కష్టపడి లక్షల్లో పెట్టుబడులు పెట్టి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోకి తీసుకొచ్చి విక్రయించే క్రమంలో బుధవారం కురిసిన వర్షానికి పత్తి, వడ్లు, మొక్కజొన్నలు పూర్తిగా తడిసాయని అందుకు నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మానవులు ధర్మ మార్గంలో నడవాలి

**మాధవానంద సరస్వతిస్వామి**

**నారాయణఖేడ్, అక్టోబరు 29 ప్రభాతవార్త :** మానవుడు సన్మార్గంలో నడవాలని మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. ఆయన బుధవారం శ్రీ గురు పంతులు శ్రీమహతి జ్యోతిష్యాలయంలో గురు మాధవానంద స్వామి పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అయన మాట్లాడుతూ మనిషి ధర్మ మార్గంలో నడవడం ద్వారా అ లక్ష్మి దోషం తొలగి స్థిర లక్ష్మి వెంట ఉంటుంది అని చెప్పారు. అదేవిధంగా కార్తీకమాసం నందు గంగా స్నానం సాలగ్రామ దానం కార్తీక వనభోజనాలు చేయడం ద్వారా సంపూర్ణమైన కార్తీక మాస ఫలం మానవులకు లభిస్తుందని స్కాంద పురాణంలో ఋషులు మనకు తెలియజేశారు అని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్వామివారి భక్తులతో పాటు పట్టణ పురోహితులు మలమంచి గురురాజ శర్మ గారు పాదపూజ నిర్వహించడం జరిగింది.

## దళారులను నమ్మొద్దు : మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

**నారాయణఖేడ్, అక్టోబరు 29(ప్రభాతవార్త) :** ప్రజలు ఇంటి పర్మిషన్ కోసం దళారులను నమ్మొద్దని నారాయనఖేడ్ మున్సిపల్ కమిషనర్ జె జగ్జీవన్ అన్నారు. బుధువారం ఆయన మాట్లాడుతూ.. మధ్యవర్తులను ఇంటి పర్మిషన్ కోసం ఎవరు డబ్బులు అడిగినా ఇవ్వద్దన్నారు. ఇంటి నిర్మాణానికి మున్సిపల్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో పర్మిషన్ వస్తుందని చెప్పారు. ఎవరైనా డబ్బులు అడిగుతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. 70 గజాల లోపు పేదలు ఎవరైనా ఉంటే ఇంటి పర్మిషన్‌కు ఒక రూపాయి పేమెంట్ చేస్తే సరిపోతుందన్నారు. మధ్యవర్తులు దళారులు ఎవరైనా డబ్బులు అడుగుతే ఇవ్వద్దని నేరుగా ఆఫీసుకు వచ్చి కలవచ్చుని అన్నారు. బిల్డ్ నౌ ద్వారా అప్లై చేయాల్సి ఉంటుందని, డాక్యుమెంట్స్ అన్నీ ఉండాలని ఉంటే 21 రోజుల్లో పర్మిషన్ వస్తుందని తెలిపారు.

## తిరుమలకు చేరిన స్వాముల పాదయాత్ర

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబర్ 29,ప్రభాతవార్త:** సంగారెడ్డిలోని నవరత్నాలయ దేవస్థానం నుండి అక్టోబర్ 6న గురుస్వామి సాహితీ రాము ఆధ్వర్యంలో ప్రాంభమైన శబరి మలకు మహా పాదయాత్ర తిరుమల చేరుకుంది. వెంకటేశ్వర స్వామి దర్శనం పూర్తిచేసుకొని కాణిపాకం, అరుణాచలం మీదుగా శబరిమల వరకు పాదయాత్ర కొనసాగుతుందని గురుస్వామి సాహితీ రాము స్వామి తెలిపారు.ఇప్పటి వరకు పాదయాత్ర 650 కిలోమీటర్లు పూర్తి చేసుకుందని తెలిపారు.

## దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**-ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు**


మాట్లాడుతున్న పోసాన్‌పల్లి రాజు

**జగదేవ్‌పూర్, అక్టోబరు 29 (ప్రభాతవార్త):** చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయిపై దాడికి పాల్పడిని వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు పోసాన్‌పల్లి రాజు డిమాండ్ చేశారు. బుధవారం జగదేవ్‌పూర్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బిఆర్ గవాయి దళితుడు కావడం వల్లే ఈ దాడి జరిగిందన్నారు. వెంటనే దాడికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సంఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జితో కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నవంబరు 1న లక్షలాది మందితో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవ ప్రదర్శనను నిర్వహించి తీరుతామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రచార కార్యదర్శి పైస స్వామి, తీగుల్‌నర్సాపూర్ అధ్యక్షుడు మాసపాక నర్సింలు, దౌలాపూర్ అధ్యక్షుడు ముక్కెర నాగరాజు, జంగారెడ్డిపల్లి అధ్యక్షుడు నర్సింలు, కడప కుమార్, వట్టిపల్లి అధ్యక్షుడు కుమార్, విహెచ్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పోసాన్‌పల్లి సాయిలు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును పరామర్శించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**

తిరిగిరాని లోకాలకు చేరిపోయిన మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావుకు బుధవారం బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి నివాళులర్పించి హరీష్‌రావును పరామర్శించారు. హైదరాబాద్‌లోని హరీష్‌రావు నివాసానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలసి అంజిరెడ్డి చేరుకుని హరీష్‌రావుకు, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.


సత్యనారాయణరావుకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## విశ్వకర్మ ఆలయానికి స్థలాన్ని కేటాయించండి

-విద్యుత్‌నగర్ సొసైటీ అధ్యక్షుడికి విశ్వకర్మల వినతి



ఆలయస్థలాన్ని కేటాయించాలని వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
విశ్వకర్మ భగవానుడి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ విశ్వబ్రాహ్మణ కులసంఘం ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్‌సొసైటీ అధ్యక్షులు అజీమ్‌కు వినతిపత్రం అందచేసినట్లు విశ్వకర్మసంఘం అధ్యక్షులు రవిచారి తెలిపారు. వినతిపత్రం అందుకున్న అధ్యక్షులు అజీమ్ స్థలాన్ని కేటాయించేందుకు సానుకూలంగా స్పందించారని, కమిటీలో చర్చించి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారన్నారు. కార్యక్రమంలో శ్రీగోవిందం విశ్వకర్మసంఘం కాలనీపెద్దలు, కాలనీ సొసైటీ మాజీ అధ్యక్షులు రామ్మూర్తిచారి, మధుసూదనచారి, బ్రహ్మాచారి, బిక్షమచారి, నరసింహచారి, శ్రీనివాస్‌చారి, దుర్గాప్రసాద్‌చారి, బాలకృష్ణచారి, మల్లేష్‌చారి, రాజేష్‌చారి, కిషోర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

## మంతూర్ పాఠశాలలో మౌలిక సదుపాయాలు

-మాజీ సర్పంచ్ సత్తార్ పటేల్



పాఠశాలలో కుళాయిలను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థినులు

**పుల్‌కల్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మంతూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించామని గ్రామ మాజీ సర్పంచ్ సత్తార్ పటేల్ తెలిపారు. పాఠశాల మరమ్మతుకు ప్రభుత్వం మంజూరుచేసిన నిధులను కాజేశారని తప్పుడు ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. పాఠశాలకు అమ్మపాఠశాల పథకంలో 8లక్షలరూపాయలు మంజూరయినట్లు, మంజూరైన నిధులతో పాఠశాల ఆవరణలో తాగునీటికి కుళాయిలు, మరుగుదొడ్లు, టాయిలెట్స్ పాఠశాలగదులకు రంగులు అద్దడం, విద్యుత్ సౌకర్యంతోపాటు విద్యార్థుల కోసం మంచినీటి అవసరాలకు 150మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. చేసిన అభివృద్ధి పనులకు గాను 4లక్షల రూపాయలు మంజూరు చేశారని, మరో 4లక్షల రూపాయలను బకాయిలో పెట్టారన్నారు. ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు నయాపైసా నిధులు మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్ సత్తార్ పటేల్ ఈసందర్భంగా గుర్తుచేశారు.

## మాయికోడ్ గ్రామాభివృద్ధికి సహకరించండి

-ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు మాయికోడ్ వాసి వినతి



ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాగేష్

**మనూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని మాయికోడ్‌గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని, గ్రామంలో కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదని నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని గ్రామానికి చెందిన బిరాదర్ నాగేష్ వినతిచేశారు. బుధవారం హైద్రాబాద్‌లోని మినిస్టర్ కార్యాలయంలో ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్‌కు గ్రామాభివృద్ధికి చేయూత అందించాలని వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా నాగేష్ మాట్లాడుతూ గ్రామంలో మురుగుకాల్వలులేవని, గ్రామానికి రోడ్డుసౌకర్యం లేదని, బస్సుసౌకర్యం కల్పించాని, తాండాకు రోడ్డునిర్మాణం చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. మండలకేంద్రమైన మనూర్‌కు వెళ్లేందుకు రోడ్డు గుంతలమయంగా మారిందని, అక్టోబరు 25న మాయికోడ్ గ్రామానికిచెందిన గుండోల దత్తు రోడ్డుపై ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ రోడ్డుపక్కనే ప్రమాదకరంగా ఉన్న బావిని మూసేయకపోవడంతో ప్రమాదవశాత్తూ బావిలోపడి దత్తు కానరానిలోకాలకు చేరిపోయినట్లు గుర్తుచేశారు. నిధులు మంజూరు చేయించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపికి వినతిచేసినట్లు, అందుకు ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్ సానుకూలంగా స్పందించినట్లు నాగేష్ పేర్కొన్నారు.

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసిన ఎంఈఓ



ఎంఈఓ రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

**పటాన్‌చెరు, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు మండలం ముత్తంగి పరిధిలోని డిఎన్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను బుధవారం పటాన్‌చెరు ఎంఈఓ నాగేశ్వర్‌నాయక్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఎంఈఓ నాగేశ్వర్‌నాయక్ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు పైన ప్రిన్సిపాల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కవిద్యార్థి పాఠశాలకు తప్పకుండా వచ్చేవిధంగా చూడాలన్నారు. విద్యార్థులకు మంచి బోధనను అందించి, రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈఓ సూచించారు.

## పరభాష కంటే మాతృభాషే ముద్దు

-వేగా కన్వేయర్స్ ఎండి శ్రీనివాస్ గరిమెళ్ల

**పటాన్‌చెరు, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
స్థానికభాషలలో ఆవిష్కరణ, శాస్త్రీయప్రసంగాన్ని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, మాతృభాషలో వ్యక్తీకరించే ఆలోచనలు తరచుగా లోతైన అర్థాన్ని, సృజనాత్మకతను కలిగి ఉంటాయని వేగా కన్వేయర్స్ అండ్ ఆటోమేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ గరిమెళ్ల అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో నిర్వహిస్తున్న మూడురోజుల ద్విభాషా జాతీయ సదస్సును బుధవారం ఆయన జ్యోతి ప్రజ్వలనంతో లాంఛనంగా ప్రారంభించారు. అఖిలభారత సాంకేతిక విద్యా మండలిలోని భారతీయ భాషాభివృద్ధి, పోషణకు మద్దతు పథకం సౌజన్యంతో దీనిని ఏర్పాటు చేయనున్నారు. స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ విఆర్‌శా సభాధ్యక్షత వహించారు.

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

-మిషన్ భగీరథ మంచినీటి పంపిణీ వ్యవస్థలో ఆటంకాలు తొలగించండి
-త్వరలో తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
-గ్రామపంచాయతీలలో నూతన అభివృద్ధి పనులకు ప్రణాళిక
-సమీక్షాసమావేశంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరు, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొనిరావాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌పరిధిలోని క్యాంపు కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో పలు అంశాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకిచెరువు, బండ్లగూడ పరిధిలోని దోషంచెరువులలోకి మురుగునీరు చేరకుండా చేపడుతున్న ప్రత్యేక పైప్‌లైన్ పనుల పురోగతిపై చర్చించారు. క్షేత్రస్థాయిలో పైపులైన్ నిర్మాణ పనులు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలను ఆదేశించాలని జిహెచ్‌ఎంసి ఇరిగేషన్ విభాగంఈఈ మల్లేష్‌ను ఆదేశించారు. పటాన్‌చెరు సాకిచెరువు, రామచంద్రాపురం రాయసముద్రం చెరువుల సుందరీకరణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. నిధుల అంశంలో ఇబ్బందులు తలెత్తితే తనదృష్టికి తీసుకొనిరావాలని, ఉన్నతాధికారులతో చర్చించి నిధులు మంజూరు చేయిస్తానని అధికారులకు సూచించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం రెవిన్యూ పరిధిలో పాలిటెక్నిక్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనాలకు త్వరలోనే భూమి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయబోతుందని తెలిపారు. భవనాల నిర్మాణాలకు సైతం నిధులు కొరతలేకుండా చూస్తున్నామని తెలిపారు. నియోజకవర్గపరిధిలోని వివిధగ్రామాలు, మున్సిపాలిటీలపరిధిలో మిషన్‌భగీరథద్వారా అందిస్తున్న మంచినీటిపంపిణీ అంశంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రజలనుండి ఫిర్యాదులు అందుతున్నాయని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జాతీయరహదారి విభాగం అధికారులతో సమన్వయంచేసుకుంటూ మంచినీటిపంపిణీ అంశంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మిషన్‌భగీరథ ఎస్ఈ రఘువీర్‌ను ఆదేశించారు. వచ్చేనెల 10వతేదీలోపు పంపిణీ అంశంలో గల ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలగిస్తామని సంబంధిత అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్‌కు తెలిపారు. త్వరలోనే సంబంధిత ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరు మండలంలోని గ్రామాలపరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను సంబంధిత ఎంపిడివోలు, కార్యదర్శులతో కలిసి చర్చించారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సిఎస్‌ఆర్ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని కోరారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో 6కోట్ల80లక్షల రూపాయలతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు వచ్చేవారంలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించవద్దని, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సమావేశంలో అమీన్‌పూర్ మాజీ జడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి దేవానంద్, పటాన్‌చెరు ఎమ్మార్వో రంగారావు, ఎంపిడివో యాదగిరి, గుమ్మడిదల ఎంపిడివో ఉమాదేవి, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ విజయలక్ష్మి, డిఈలు హరీష్, శ్రీనివాస్, ఎఈ మోనిక, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఝురాసంగంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రం

-కేంద్రాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు



సోయాబీన్ కొనుగోలుకేంద్రాన్ని ప్రారంభిస్తున్న హనుమంతరావుపాటిల్

**ఝురాసంగం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన ఝురాసంగంలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్ ప్రారంభించారు. ఈసందర్భంగా హనుమంతరావుపాటిల్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకుని ఆర్థికంగా ప్రయోజనం అందుకోవాలని మండల రైతులకు సూచించారు. మధ్యదళారులకు పంటలను అమ్ముకుని ఆగం కావొద్దని రైతులకు హనుమంతరావు సూచించారు. కార్యక్రమంలో శ్రీ కేతకి సంగమేశ్వరస్వామి ఆలయకమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, సొసైటీ చైర్మన్ గౌసోద్దిన్, నాయకులు రమేష్‌చారి, సులేమాన్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్‌పై ధాన్యం.. ప్రయాణికులకు అంతరాయం..

-ప్రమాదాల బారిన వాహన చోదకులు
-పట్టించుకోని అధికారులు



రోడ్డుపై వేసిన వరిధాన్యం

**నారాయణఖేడ్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
నారాయణఖేడ్ నియోజకవర్గంలో రహదారులు ఎక్కడ చూసినా ధాన్యాల కుప్పలతో దర్శనమిస్తున్నాయి. వరి కోతలు జోరందుకున్న నేపథ్యంలో అన్నదాతలు వరికోత యంత్రాలతో కోస్తున్నారు. కోసిన ధాన్యాన్ని రోడ్ పైన ఎక్కడపడితే అక్కడ ఆరబోస్తున్నారు. ఆ ధాన్యాన్ని ఆరబెట్టడంతో వాహన చోదకులకు ముప్పుతిప్పలు అవుతుంది. రాత్రివేళ ఐతే ప్రయాణికులకు ధాన్యం కుప్పలు కనిపించకపోవడంతో తరుచ ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. ధాన్యాన్ని ఆరబెట్టడంతోపాటు వాటిని ఎగ పోస్తుండడంతో ఆ దుమ్ముధూళి కళ్ళలోపడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో సైతం వరి ధాన్యాల వలన ప్రమాదాలకు గురై, గాయాలపాలు అయిన సంఘటనలు వున్నాయి. దాంతో పాటు ప్రాణనష్టాలు కూడా జరిగాయి. దీంతో ఉన్నత అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై ధాన్యాలు ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు వేడుకున్నారు.

## రామచంద్రాపురంలో స్వచ్ఛతా ప్రత్యేక ప్రచారం



రామచంద్రాపురంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని బిహెచ్ఈఎల్ యాజమాన్యం ఆధ్వర్యంలో రామచంద్రాపురంలో స్వచ్ఛతా ప్రత్యేక ప్రచారం 5.0 జరుగుతోంది. ప్రచారంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్టాఫ్ క్యాంటీన్ ప్రాంతం, రికార్డ్ రూమ్, బాయిలర్ హౌస్ ప్రాంతం, దట్టమైన అటవీప్రాంతాలను శుభ్రపర్చడం, కూరగాయల మార్కెట్ నుంచి టౌన్‌షిప్‌లని వివిధ ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త, ఇ-వ్యర్థాలను తొలగించడం, సెల్ఫీబూత్‌ల ఏర్పాటు, వ్యూహాత్మక ప్రదేశాలలో బ్యానర్‌ల ప్రదర్శన, డిజిటల్ డిస్‌ప్లేలు, టౌన్‌షిప్‌లో సింగిల్ యూ ప్లాస్టిక్ ఆడిట్‌లను శుభ్రంచేశారు. 85925 చదరపు అడుగుల విస్తీర్ణంలో శుభ్రంచేశారు. 600 భౌతిక ఫైళ్ళ, 140 డిజిటల్ ఫైళ్లను సమీక్షించి తొలగించారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-రైతులకు ఎడిఎ నూతన్‌కుమార్ సూచన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎడిఎ నూతన్‌కుమార్

**నాగల్‌గిద్ద, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధిచెందాలని వ్యవసాయ సహాయ సంచాలకులు నూతన్‌కుమార్ సూచించారు. మండలపరిధిలోని దామరగిద్దలో ప్రభుత్వం అందించే పథకాలపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందించేందుకు రైతులనుంచి దరఖాస్తులను స్వీకరిస్తోందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ శివారులో రైతులు సాగుచేసుకుంటున్న పత్తి పంటను ఏడిఏ నూతన్‌కుమార్ ఏఈఓ సంతోష్‌తో కలిసి పరిశీలించారు.

## ఏఈఓ శ్వేతను పరామరించిన నగేష్ శెట్కార్

**సిర్గాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండలంలో వ్యవసాయ విస్తీరణ అధికారిగా సేవలు అందిస్తున్న శ్వేత ఆనారోగ్యంతో హైద్రాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నట్లు తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌కుమార్ శెట్కార్ పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకుని శ్వేతకు, శ్వేత కుటుంబ సభ్యులకు నగేష్‌కుమార్ శెట్కార్ ధైర్యం చెప్పారు.

# విజయవంతమైన శాండ్విక్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

-శాండ్విక్ పర్మనెంట్, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు
-జీవోలకు మించి సాధించుకున్న వేతనాలు
-రోజుకు రూ.285లు చెల్లించడానికి అంగీకరించిన యాజమాన్యం



కార్మికులతో మాట్లాడుతున్న చుక్క రాములు

**పటాన్‌చెరు, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో గల శాండ్విక్ పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరగాలని శాండ్విక్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శాండ్విక్ పర్మనెంట్ యూనియన్ సహకారంతో గత రెండు నెలలుగా చేస్తున్న ఆందోళన పోరాటం విజయవంతమైది. శాండ్విక్ పర్మినెంట్, కాంట్రాక్టు యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు ప్రత్యేకకృషితో జీవోలకు మించి వేతనాలు సాధించుకోవడం జరిగింది. బుధవారం జరిగిన కాంట్రాక్టు కార్మికుల జనరల్‌బాడీ సమావేశానికి చుక్కా రాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చుక్కా రాములు మాట్లాడుతూ.. యాజమాన్యంపై వత్తిడిచేసి జీవో పైన అదనంగా రూ.285ల పెరుగుదల సాధించామన్నారు. కాంట్రాక్టు కార్మికుల వేతనాలు సౌకర్యాల కొరకు రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు నికరంగా పోరాడుతున్నదని, ఈ పోరాటానికి ఐక్యంగా మద్దతునివ్వాలని కార్మికవర్గానికి ఆయన పిలుపునిచ్చారు. ఈసమావేశంలో యూనియన్ నాయకులు పి.పాండురంగారెడ్డి, వీరారావు, బివిఆర్కె రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన రోడ్డు గుంతలు

**నిజాంపేట్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
నిజాంపేట్ మండలంలోని మునిగేపల్లి చౌరస్తా వద్ద ప్రమాదకరంగా గుంతలుపడి రోడ్డు ప్రమాదకరంగా మారింది. నిత్యం అనేక వాహనాలు ఈ రూట్లో తిరుగుతున్నవి. ఎందరో ప్రమాదాలకు గురి అవుతున్నారు. వరి కొనుగోలు కేంద్రం ఏర్పడి, వరి కొనుగోలు చేస్తే లారీలు రావడానికి పోవడానికి చాలా ఇబ్బందిగా ఉంటుంది. ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. దీనిపై అధికారులు స్పందించి గుంతలను వెంటనే పూడ్చాలని నాగదర్ గ్రామానికి చెందిన రైతులు పాశం బాల్‌రెడ్డి నాయకుని పందరి తదితరులు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎమ్మార్వో ఆఫీస్‌లో వినతిపత్రం ఇవ్వడం జరిగినది. దీనిపై అధికారులు స్పందించి గుంతల పడిన రోడ్లను సరిచేసేవిధంగా చూడాలని ఈరూట్లో తిరిగే వాహన దారులు, రైతులు రైతులకు వడ్లు కొనుగోలు కేంద్రాలకు లారీలు వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు.

## అకాలవర్షాలతో ధాన్యం నీటిపాలు

-అన్నదాత పరిస్థితి ఆగం ఆగం



రహదారిపై ఆరబెట్టిన ధాన్యం నీటిలో కొట్టుకుపోతున్న దృశ్యం

**పుల్‌కల్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
అకాలవర్షాలతో అన్నదాత పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అప్పులుచేసి పండించుకున్న వరి కోతకోసి ఆరబెట్టుకుంటే అకాలవర్షాలతో నీటిపాలై రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షానికి కోతకోసిన ధాన్యం, ఆరబెట్టుకున్న ధాన్యం నీటిపాలుకావడం, కోతకు సిద్ధంగా ఉన్న పంట నేలకొరగడంతో అన్నదాతలు దిక్కుతోచక ఆగం ఆగం అవుతున్నారు. అర్థరాత్రికి వాన దంచికొట్టడంతో ఆరబెట్టిన వరి నీట కొట్టుకుపోయింది. అకాలవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించినా ప్రభుత్వం కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అకాల వర్షాలకు పాడైన పత్తి పంట



అకాల వర్షాలకు పత్తి పంట ధ్వంసం అయిన దృశ్యం

**సిర్గాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
అకాల వర్షాలకు రైతులు సాగుచేస్తున్న మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని వాసర్, గౌడగాం, వంగ్దాల్, చీమలపాడ్, సంగం, పొట్‌పల్లి, గరిడేగాం తదిరత గ్రామాల్లో పత్తి పంట ధ్వంసం అయింది. పత్తిపంట చేతికి అందే తరుణంలో కురిసిన వర్షాలకు పంట ధ్వంసం అయిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

## సిర్గాపూర్‌లో ధన్వంతరి జయంతి



ధన్వంతరి జయంతి జరుపుకుంటున్న నాయి బ్రాహ్మణులు

**సిర్గాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో బుధవారం నాయి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వైద్యనారాయణ ధన్వంతరిజయంతిని ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య నారాయణ ధన్వంతరి చిత్రపటానికి మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంజన్న, సుభాష్, లక్ష్మణ్, నరేష్ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ తహసీల్దార్



పాఠశాలను తనిఖీ చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ హేమంత్‌కుమార్

**సిర్గాపూర్, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
మండలంలోని నల్లవాగు గురుకుల పాఠశాలను బుధవారం డిప్యూటీ తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగదిని, విద్యార్థులకై వండినభోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ క్రమశిక్షణతో విద్యను అందుకుంటే ఉన్నతస్థానాలకు చేరుకోవడం తథ్యమని విద్యార్థులకు ఆయన సూచించారు.

## పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

-సామాజికవేత్త డాక్టర్ కోట ధన్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న సామాజికవేత్త డాక్టర్ కోట ధన్‌రాజ్

**ఝురాసంగం, అక్టోబరు 29, ప్రభాతవార్త:**
అధిక, అకాలవర్షాలతో రైతులు సాగుచేసుకుంటున్న పత్తిపంట దిగుబడి తక్కువగా వస్తోందని సామాజికవేత్త డాక్టర్ కోట ధన్‌రాజ్ విచారం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 10క్వింటాళ్లకుపైగా దిగుబడి వచ్చే దని, ఈసారి భారీవర్షాలతో మూడు నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి కూడా రావడంలేదని విచారంవ్యక్తంచేశారు. ఆర్థికంగా కష్టనష్టాలకులోనైన రైతాంగానికి రాష్ట్రప్రభుత్వం ఎకరానికి 30వేల రూపాయల చొప్పున నష్ట పరిహారం అందించాలని ధన్‌రాజ్‌గౌడ్ డిమాండ్‌చేశారు.